క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీనారసింహ హోమం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

చివ్వెంల : మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామశివారులోని గిరిదుర్గంలో వెలిసిన శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో బుధవారం శ్రీసుదర్శన సహిత లక్ష్మీనారసింహ హోమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు శ్రీమాన్ కిరణ్‌కుమార చార్యులు, శ్రీమాన్ క్రిష్ణమాచార్యులు మంత్రోచ్చరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చకిలం క్రిష్ణకుమార్, బందకవి క్రిష్ణమోహన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు స్కీమ్‌లపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిశోర్

చివ్వెంల : రైతులు బ్యాంకులు అందిస్తున్న రుణాలపజై అవగాహన కలిగి ఉండాలని సూర్యాపేట ఎస్‌బీఐ (ఏసీబీ) అగ్రిఫీల్డ్ ఆఫీసర్ కిశోర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గుంజలూరు గ్రామంలో స్కీమ్‌లపై రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ బ్యాంకులో తీసుకున్న రుణాలకు సంవత్సరం లోపు రెన్యూవల్ చేసుకుంటే సగం వడ్డీ పడుతుందన్నారు. రైతులు పంట నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కీమ్‌లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రతి ఖాతాదారుడికి బ్యాంకులో ఇన్సురెన్స్ ఉంటుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఓఎస్‌లు నాగయ్య, సతీష్, సాబీర్, రైతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

నూతనకల్ : మండలంలోని మిర్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వేల్పుల కొమరయ్య ఇటీవల మృతి చెందారు. కాగా పార్టీ గ్రామ నాయకులు బుధవారం మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తలు సమకూర్చిన రూ.లక్ష ఆర్థికసాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి మీదుగా 10ఎలక్ట్రికల్ ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు

అర్వపల్లి : అర్వపల్లి మీదుగా హైదరాబాద్‌కు 10ఎలక్ట్రికల్ ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు నడపనున్నట్లు సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్ జి.లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ బానోతు సైదులు తెలిపారు. బుధవారం బస్సులను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రతిరోజు సూర్యాపేట డిపో నుంచి ఉదయం 5, 6, 7, 8.30గంటలకు, మధ్యాహ్నం 12.30, 1.10, 1.50, 2.30, 3.10గంటలకు బస్సులు నడవనున్నాయని తెలిపారు. ప్రయాణికులు ఈ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు బైరబోయిన రామలింగయ్య, దావుల లింగయ్య, గుగ్గిళ్ల వేణు, ఊషయ్య, శ్రీను, రమేష్, నర్సింహరాజు, అశోక్, సైదులు పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం పీఏసీఎస్‌లో రైతులకు కావాల్సిన వివిధ రకాల వరివిత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ సీఈఓ ఊర సత్యనారాయణ బుధవారం తెలిపారు. తమ వద్ద బీపీటీ 5204, ఎంటీయూ 1010, కేఎన్ఎం 118, ఎంటీయూ 1290, జేజీఎల్ 24423, ఎంటీయూ 1224 రకాల వరి విత్తనాలు ఉన్నాయని, కావాల్సిన రైతులు తీసుకెళ్లాలని సూచించారు.

ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మెలను ఏర్పాటు చేయాలి

చివ్వెంల : ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మెను ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ బచ్చలకూరి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. జూలై 7న జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల అధ్యక్షుడు కొంగల సతీష్, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు చెరుకుపల్లి కిరణ్‌కుమార్, చెరుకుపల్లి సతీష్, మెరిగ ఈదయ్య, మోహన్, శ్రీకాంత్, గోపిచంద్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనంలో విధులు

- 2020లో ఎస్టీఓ నూతన భవన నిర్మాణానికి రూ.15లక్షలు మంజూరు
- నిధులు సరిపోక నిలిచిన పనులు
- నాలుగేళ్లుగా ప్రారంభానికి నోచుకోని నూతన భవనం
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు



తుంగతుర్తిలో నిర్మించిన నూతన ఎస్టీఓ కార్యాలయ భవనం



శిథిలావస్థకు చేరిన ఎస్టీఓ కార్యాలయం

తుంగతుర్తి : మండల కేంద్రంలో గత నాలుగు సంవత్సరాల క్రితం నిర్మించిన ఎస్టీఓ (సబ్ ట్రెజరరీ కార్యాలయం) నూతన భవనం ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వం 2020లో స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎస్టీఓ కార్యాలయం భవన నిర్మాణానికి రూ.15లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో కాంట్రాక్టర్ భవనాన్ని నిర్మించి చివరికి నిధులు సరిపోలేదని సాకుతో ఫ్లోరింగ్ చేయకుండా చివరి దశలో వదిలేశాడు. మరో రూ.2లక్షలు కేటాయిస్తే ఫ్లోరింగ్ చేసి అప్పగిస్తానని సంబంధిత కాంట్రాక్టర్ అంటున్నారు. కానీ ప్రభుత్వం అదనపు నిధులు కేటాయించకపోవడంతో నాలుగు ఏళ్లుగా భవనం పనులు పూర్తి చేయకుండా చివరి దశలో నిలిపివేశారు. ప్రభుత్వం మరో రూ.2లక్షలు కేటాయిస్తే కార్యాలయ నూతన భవనంలో ఫ్లోరింగ్ పూర్తవుతుంది. దీంతో భవనం వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. కానీ ఈ విషయంపై ప్రజా ప్రతినిధులు, అధికారులకు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

శిథిలావస్థలో భవనం..

తుంగతుర్తిలోని ఎస్టీఓ కార్యాలయ పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షాలకు కురుస్తుండంతో ఎస్టీఓ కార్యాలయంలో ఉన్న రికార్డులు తడిసిపోతున్నాయి. భవనం పైకప్పు పెచ్చులూడుతుండంతో భవనం ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ భవనం కేవలం రెండు గదులు మాత్రమే ఉండడంతో సిబ్బంది కూర్చోవడానికి సైతం స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయంలో ఒక పక్క బీరువాలు, మరోపక్క రికార్డులకే స్థలం సరిపోతుంది. దీంతో ఎస్టీఓ సిబ్బందితో పాటు కార్యాలయానికి వచ్చే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఎస్టీఓకు తుంగతుర్తి నియోజకవర్గంలోని తుంగతుర్తి, తిరుమలగిరి, నాగారం, అర్వపల్లి, నూతకల్, మద్దిరాల మండలాల ఉద్యోగులు తమ వేతనాలు, పాఠశాలల బిల్లులు తదితర పనులపై వస్తుంటారు. కార్యాలయంలో సరైన మౌలిక వసతులు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నూతన భవనానికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేసి ప్రారంభించాలని ఎస్టీఓ సిబ్బంది, ఆయా మండలాల ఉద్యోగులు కోరుతున్నారు.

మోదీ 11ఏళ్ల పాలనలో దేశం అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

తాళ్లగడ్డ (సూర్యాపేట) : మోదీ 11ఏళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సంకల్పం సహకారం కార్యక్రమంలో భాగంగా పార్టీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మేధావుల సదస్సు, మోదీ 11ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాల చిత్రాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన రాష్ట్ర అధికార కట్టా సుధాకర్‌రెడ్డి, జిల్లా ప్రభారి రాజమౌళితో కలిసి ప్రారంభించారు. అనంతరం బూర నర్సయ్యగౌడ్ మాట్లాడారు. నరేంద్రమోదీ 11ఏళ్ల పాలన దేశానికి కొత్త దిక్సూచి చూపించిందని, అభివృద్ధి, పారదర్శకత, సంక్షేమం అనే మూడు మూలస్తంభాలపై దేశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో మోదీ నాయకత్వం నిరూపితమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా సామాన్య ప్రజలకు ప్రత్యక్ష లాభాలు ఎలా కలుగుతున్నాయో వివరిస్తూ, యువత, రైతులు, మహిళలు, చిన్న వ్యాపారులకు ఉన్న అవకాశాలను ప్రస్తావించారు. సమావేశంలో పార్టీ తుంగతుర్తి అసెంబ్లీ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, బూర మల్సూర్‌గౌడ్, చలమల్ల నర్సింహ, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల సీనియర్ నాయకులు, ప్రభారీలు, మేధావులు, తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిని పూర్తిగా నయం చేయొచ్చు

అర్వపల్లి : క్షయవ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ భూక్య నగేష్‌నాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని కుంచమర్తి గ్రామంలో క్షయ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్షయను నిర్లక్ష్యం చేయకుండా తగు వైద్యం పొందితే పూర్తిగా నయం అవుతుందన్నారు. అనంతరం 20మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ నివారణ నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, ఎల్‌టీ చొక్కయ్య, హెల్త్‌అసిస్టెంట్ నాగరాణి, ఆశాకార్యకర్త పగిళ్ల విజయ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



సూర్యాపేట : విద్యార్థులకు ఆహారాన్ని వడ్డిస్తున్న డీడబ్ల్యూఓ నర్సింహరావు



నూతనకల్ : ర్యాలీలో పాల్గొన్న సీడీపీఓ శ్రీవాణి

అర్వపల్లి : అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ అనిత కోరారు. మండల పరిధిలోని రామన్నగూడెంలో బుధవారం జరిగిన అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులకు అంగన్‌వాడీ కేంద్రాల ప్రాముఖ్యత తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అనిరెడ్డి పుష్పావతి, పంచాయతీ కార్యదర్శి జె.సుధాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటపాటలతో చదువు

పెన్‌పహాడ్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట పాటలతో చదువు, నాణ్యమైన భోజనం అందుతుందని అంగన్‌వాడీ టీచర్ బుజ్జమ్మ అన్నారు. బుధవారం దుబ్బతండాలో అమ్మ మాట–అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 30నెలలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల హెచ్‌ఎం బైరెడ్డి భద్రారెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిల్లల సమగ్రాభివృద్ధికి పునాది అంగన్‌వాడీ

నూతనకల్ : పిల్లల సమగ్రాభివృద్ధికి పునాదులు అంగన్‌వాడీ కేంద్రాలేనని సీడీపీఓ శ్రీవాణి అన్నారు. బుధవారం మండల పరిధిలోని దిర్శనపల్లిలో నిర్వహించిన అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ప్రాముఖ్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని అంగన్‌వాడీ టీచర్లను ఆమె కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు అందించే పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని ఆమె కోరారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన ర్యాలీల్లో ఎంపీడీఓ సునిత, వివిధ స్థాయి అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సాయిగీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, టీచర్లు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్యతో అభివృద్ధి

సూర్యాపేట : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన విద్య అందించడంతో చిన్నారుల్లో శారీరక అభివృద్ధితో పాటు మానసిక అభివృద్ధి పెరుగుతుందని డీడబ్ల్యూఓ కె.నర్సింహరావు అన్నారు. బుధవారం మండలంలోని పిల్లలమర్రిలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ముందుగా విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సీడీపీఓ సుబ్బలక్ష్మి, సూపర్‌వైజర్ వీరమ్మ, ఏఎన్ఎం పద్మజ, అంగన్‌వాడీ టీచర్లు రమణ, సుజాత, సలోమి, ఆశాకార్యకర్తలు అర్చన, వెంకట మ్మ, సునీత, స్వర్ణలత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనంతో అధిక పంట దిగుబడి



మద్దిరాల : సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి జి.శ్రీధర్‌రెడ్డి

మద్దిరాల : నాణ్యమైన విత్తనంతో అధిక పంట దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి జి.శ్రీధర్ రెడ్డి, భారత వరిపరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్‌చౌహాన్, కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్త ఎ.కిరణ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోరెంట్ల రైతువేదికలో ఏర్పాటు చేసిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పంటల మార్పిడి ద్వారా పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనిషారూహి, శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్, ఏడీఏ ఎల్.రమేష్‌బాబు, ఏఈఓలు అనుషా, మనోహర్, శరత్, రైతులు సోమయ్య, అంజయ్య, వెంకన్న, నాగయ్య పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

తుంగతుర్తి : రైతులు తమ పంట పొలాల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సీహెచ్ నరేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెంపటి గ్రామంలో రైతులకు నిర్వహించిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు. వానాకాలం పంటలకు తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలు, ప్రభుత్వ సబ్సిడీలు, ఇతర అంశాలపై రైతులకు వివరించారు. వరి, పత్తి, మిరప, ఆయిల్‌పామ్, కూరగాయలు మొదలైన పంటల సాగులో నూతన యాజమాన్య మెళకువలు వివరించారు. అనంతరం భారత జాతీయ వరి పరిశోధన సంస్థ, శాస్త్రవేత్త డా.గోపినాథ్ వరిలో నేరుగా విత్తనాలు నాటే విధానం, భూసార పరీక్షలు చేసే విధానం సాగులో నూతన యాజమాన్య మెళకువలను వివరించారు. కార్యక్రమంలో అశోక్, సుగంధి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తిరుమలగిరి : మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన షేక్ ఫకీర్‌కు రూ.35వేలు, షేక్ చంటికి రూ.28వేలు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బుధవారం స్థానిక కాంగ్రెస్ నాయకుడు కుంభం సతీష్‌గౌడ్ బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో మొరిగడ్డుల వెంకన్న, షేక్ రజాక్, షేక్ కరీమ్, చిలుకల శ్రీశైలం, ఎల్లంల అశోక్, ఆకుల రమేష్‌గౌడ్, గడ్డం వెంకన్న, సట్టు శంకర్, మల్లేష్, దయాయాదవ్, హనుమంతు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే భూభారతి సదస్సులు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



తాళ్లగడ్డ (సూర్యాపేట) : భూ భారతి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్



అర్వపల్లి : కోడూరు రెవెన్యూ సదస్సులో రైతుతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : రైతుల భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సూర్యాపేట మండల పరిధిలోని కేసారం గ్రామంలో బుధవారం ఆయన రేషన్ దుకాణం, అంగన్‌వాడీ కేంద్రం, పల్లెదవాఖానాలను సందర్శించి మాట్లాడారు. సన్న బియ్యం పంపిణీ వివరాలను డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేసారంలోని రైతు వేదికలో జరుగుతున్న భూ భారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. జూన్ 20వరకు కొనసాగే ఈ రెవెన్యూ సదస్సులలో రైతులు పాల్గొని తమ భూ సమస్యలను పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం రెండో కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని, పల్లె దవాఖానాను సందర్శించి మందుల రిజిస్టర్, హాజరు పట్టికను పరిశీలించారు. అన్ని రకాల మందులు స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీఓ వేణుమాధవ్, తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్ఐ శ్రీధర్, పల్లె దవాఖాన సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఐఎన్ఎం ఉపేంద్ర పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ లాలు సూచించారు. బుధవారం మండలంలోని అనంతారం, చీదెళ్ల గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతారం 52, చీదెళ్ల 98 గ్రామాల్లో రైతులు వివిధ భూసమస్యలపై దరఖాస్తులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాధ, ఆర్ఐలు రంజిత్‌రెడ్డి, అజీజా పాల్గొన్నారు.

నాగారం : భూ భారతితో రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ హరికిశోర్ శర్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలను నిర్వహిస్తుందన్నారు. రైతులు రెవెన్యూ గ్రామసభను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 109దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌భేగం, ఆర్ఐ అల్లావుద్దీన్, ఎంపీఎస్ఓ చింతమల్ల రమేష్, సీనియర్ అసిస్టెంట్ షఫీ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అర్వపల్లి : భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులు తమ భూసమస్యలను పరిష్కరించుకోవాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. మండల పరిధిలోని కోడూరులో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతులతో మాట్లాడారు. అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలు ఈ సదస్సుల ద్వారా పరిష్కారం కానున్నాయన్నారు. అలాగే ఆర్డీఓ వేణుమాధవరావు కూడా సదస్సును సందర్శించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కోడూరు, రామన్నగూడెం, కొత్తగూడెం గ్రామాల్లో రైతులు 192దరఖాస్తులు తీసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి. శ్రీకాంత్, నాయబ్ తహసీల్దార్ యాదగిరి, గిర్దావర్‌లు జలేందర్‌రావు, వెంకట్‌రెడ్డి, ప్రసన్న, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

తిరుమలగిరి : భూ సమస్యల పరిష్కారం కోసం మండలంలోని అనంతారం, తొండ, నందాపురం గ్రామాలలో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహ్మద్, ఆర్ఐలు జార్జిరెడ్డి, సుజిత్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ అనిత, అశోక్, సుభద్ర, చందు, వినోద్, అజయ్, రవికాంత్ పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

చివ్వెంల : రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రకాశ్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కుడకుడ, వల్లభాపురంలో గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 190 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐలు శ్రావణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

నూతనకల్ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులు ముగిసినట్లు తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పెదనెమిల గ్రామంలో నిర్వహించిన చివరి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో 208 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మండలంలోని 14 రెవెన్యూ సదస్సుల నుంచి 1648 దరఖాస్తులు వచ్చినట్లు, వాటిని త్వరలోనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండలంలో 13రెవెన్యూ గ్రామపంచాయతీలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా మొత్తం 1823 దరఖాస్తులు స్వీరించినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ కంఠమయ్య తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కుంటపల్లి గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటిని వృథా చేయొద్దు



రోడ్లపై చెత్త వేయొద్దని ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్

సూర్యాపేట : మిషన్ భగీరథ ద్వారా పట్టణ ప్రజలకు అందిస్తున్న తాగునీటిని వృథా చేయకుండా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా 10వరోజు బుధవారం పట్టణంలోని 10వ వార్డు కుప్పిరెడ్డిగూడెంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలం దృష్ట్యా ప్రజలు తమ పరిసరాలలో, ఇళ్లలో నీరు నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉంచుకొని ఇళ్లలోని తడి–పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందివ్వాలన్నారు. అనంతరం వీధుల్లో చెత్త వేయవద్దని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, వార్డ్ అధికారి పి.నరేష్, సయ్యద్ సమ్మి, టీఎంసీ శ్వేత, గుండు నాగరాజు, జవాన్ రఫీ, మెప్మా సిబ్బంది, పారిశుధ్య, నీటి సరఫరా సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్ సిద్ధం

సూర్యాపేట అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు యూనిఫామ్ అందించేందుకు మహిళా సంఘాల సభ్యులతో కట్టించి సిద్ధం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ తెలిపారు. పట్టణం పరిధిలోని 43 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన 3633 జతల యూనిఫామ్‌లను స్కూలు ప్రారంభానికి ముందే పాఠశాలల హెచ్‌ఎంలకు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సత్యారావు, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, ఎండీ.గౌసుద్దీన్, మెప్మా టీఎంసీ శ్వేత, మెప్మా సిబ్బంది, స్కూల్ హెచ్‌ఎంలు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వర్గీయుల మధ్య ఘర్షణ

నాగారం : మండల కేంద్రంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక విషయంలో కాంగ్రెస్ పార్టీలోని స్థానిక రెండు వర్గాల మధ్య బుధవారం ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామంలోని ఒక వర్గానికి చెందిన నాయకుడు రూపొందించిన జాబితాపై ఎంపీడీఓ కార్యాలయంలో మరో వర్గానికి చెందిన నాయకుడు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఒకరికొకరు దూషించుకున్నారు. అనంతరం ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో జాజుల వీరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయంపై ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

కాంగ్రెస్ నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం

తుంగతుర్తి : మంత్రివర్గంలో బడుగు బలహీన వర్గాలకు చోటు కల్పించిన సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోరుకొప్పుల నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభతో విద్యార్థులకు గుర్తింపు

మద్దిరాల : విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిస్తే గ్రామంలో, పాఠశాలలో మంచి గుర్తింపు ఉంటుందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, డీఈఓ అశోక్ అన్నారు. మండల పరిధిలోని గోరెంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన శిరంశెట్టి శివ ఇటీవల నిర్వహించిన పదోతరగతి ఫలితాలలో 531మార్కులు సాధించడంతో బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్, డీఈఓ విద్యార్థిని అభినందించి మెమెంటోతో పాటు నగదు పురస్కారం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షరీఫ్‌ఉన్నిసా బేగం, ఉపాధ్యాయులు రమేష్, కృష్ణ, వీణ, భిక్షం ఉన్నారు.

విద్యార్థినికి సన్మానం

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని జి.సింధు ఇటీవల ప్రకటించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభకనబర్చి 505మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. దీంతో ఆ విద్యార్థిని బుధవారం సూర్యాపేటలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం, అవార్డు అందుకున్నట్లు ఎంఈఓ నకిరేకంటి రవి తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, మండలంలోని అన్నారం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలు ఉత్తమ పాఠశాలలుగా ఎంపికైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నకిరేకంటి రవి, రాచూరి కృష్ణయ్య, కృష్ణప్రసాద్, ఉపేందర్, ధనేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థినిని సన్మానించిన కలెక్టర్

నాగారం : మండలంలోని ఫణిగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పి.పూజ ఇటీవల జరిగిన పదోతరగతి పరీక్ష ఫలితాల్లో 545మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. దీంతో బుధవారం సూర్యాపేటలోని కలెక్టరేట్‌లో జరిగిన సన్మానంలో కలెక్టర్ విద్యార్థినికి ప్రశంసాపత్రం అందించి, మెమొంటోతో సన్మానించి, రూ.వెయ్యి నగదు అందజేశారు. అలాగే జిల్లాలో బెస్ట్ ప్రాక్టీస్ స్కూల్స్‌గా ఎంపికైన వర్ధమానుకోట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు రూ.లక్ష, పసునూర్ ప్రాథమిక పాఠశాలకు మెమొంటోతో పాటు రూ.70వేలు నగదు అందజేసి, ఆ పాఠశాల హెచ్‌ఎంలను, ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో డీఈఓ అశోక్, మండల విద్యాధికారి ప్రభాకర్, శ్రవణ్, జనార్దన్, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని శ్రావ్యకు కలెక్టర్ సన్మానం

అర్వపల్లి : అర్వపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వర్రె శ్రావ్య ఇటీవల ప్రకటించిన పదోతరగతి ఫలితాల్లో జిల్లా స్థాయిలో 4వ ర్యాంక్ సాధించింది. దీంతో విద్యార్థినిని బుధవారం సూర్యాపేటలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, డీఈఓ అశోక్‌లు సన్మానించి ప్రశంసాపత్రం, షీల్డ్, నగదు ప్రోత్సాహకం అందజేశారు. అలాగే ఉత్తమ పాఠశాలగా అవార్డు అందుకున్న పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, ఎంఎన్ఓ ప్రభాకర్, పీడీ మల్లేష్ పాల్గొన్నారు.

ఉత్తమ ప్రాక్టీస్ స్కూల్‌గా పెదనెమిల పాఠశాల

నూతనకల్ : మండల పరిధిలోని పెదనెమిల జెడ్పీ ఉన్నత పాఠశాల ఉత్తమ ప్రాక్టీస్ స్కూల్‌గా ఎంపికైనట్లు మండల విద్యాధికారి ఎం.రాములునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఉత్తమ ప్రాక్టీస్ స్కూల్ అవార్డుతో పాటు, పాఠశాల హెచ్‌ఎం డి.శివయ్యకు బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డును కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. పాఠశాలకు జిల్లా స్థాయిలో అవార్డులు రావడం పట హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

సూర్యాపేట : కష్టాన్ని నమ్ముకున్న రైతుల పండుగ ఏరువాక పౌర్ణమి అని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్‌లో ఏరువాక పౌర్ణమి సందర్భంగా పాడికి పూజలు నిర్వహించి వ్యవసాయ పనులు ప్రారంభించి మాట్లాడారు. ప్రకృతిని దైవంగా భావిస్తూ, భూమిని పూజించే సంప్రదాయం మన సంస్కృతిలో ప్రత్యేకమైందన్నారు. తొలకరి చినుకులు పడుతుండడంతో జిల్లాలో రైతులు ఉత్సాహంగా ఏరువాక పౌర్ణమి పండుగను జరుపుకుంటున్నారని అన్నారు. విస్తారమైన వర్షాలతో నదులు నిండి పంట భూముల్లో సిరుల పంటలు పండాలని, రైతన్నల ఇంట పండుగ వాతావరణం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ రైతులందరికీ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాగలి పట్టి పొలం దున్నారు.

పాలకులను ప్రశ్నించాలి

సూర్యాపేటటౌన్ : ప్రజలు కామన్ స్కూల్ విద్య కోసం పాలకులను ప్రశ్నించాలని సామాజిక అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఎల్.భద్రయ్య పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని డీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన వేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు తమ సంపాదన విద్య, వైద్యంపైనే ఖర్చు చేస్తూ పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారని అన్నారు. ఫీజుల నియంత్రణ ఉండదని, పుస్తకాల విక్రయాలు, యూనిఫామ్ ఇతర ఖర్చులతో సతమతమవుతారని అన్నారు. సమాన, నాణ్యమైన విద్య పేదలకు అందని ద్రాక్షగా మారిందన్నారు. ప్రజలు, ఉపాధ్యాయులు కలిసి తమ బడిని తామే కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో రేపాక లింగయ్య, షేక్ సుభాని, సభ్యులు అబ్దుల్ కరీం, వెంకట్‌యాదవ్, పుప్పాల వీరన్న, షేక్ ఉమర్, మిర్యాల మధు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

అర్వపల్లి : ఆయిల్‌పామ్ తోటలసాగు లాభదాయకమని అర్వపల్లి దేవస్థాన చైర్మన్, ఆయిల్‌పామ్ తోట సాగు రైతు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రామన్నగూడెంలోని రైతు వేదికలో జరిగిన ఆయిల్‌పామ్ రైతుల అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. అధికారుల సూచన మేరకు 5ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసి అంతర పంటగా మిర్చి వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ రమేష్‌బాబు, ఏఓ గణేష్, ఏఈఓలు సత్యం, శోభారాణి, శ్వేత, శశికుమార్ పాల్గొన్నారు.